క్లుప్తంగా

కంబగిరిస్వామి సేవలో కాటసాని


స్వామివారికి పూజలు చేస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

అవుకు: మండల పరిధిలోని లక్ష్మీ కంబగిరి స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట శేఖర్ రెడ్డి, కంబగిరిస్వామి, కంబగిరి ఉన్నారు.

కబడ్డీ విజేత కొలిమిగుండ్ల


విజేత జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న వాల్మీకి సంఘం నేతలు

బేతంచెర్ల: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కొలిమిగుండ్ల జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 20 జట్లు హోరాహోరాగా తలపడ్డాయి. పెట్నికోట ద్వితీయ, బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం జట్టు ద్వితీయ, బేతంచెర్ల టౌన్ జట్టు నాల్గవ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు శనివారం గ్రామ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వరుసగా రూ. 25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

చౌడేశ్వరిదేవికి సహస్ర దీపాలంకరణ సేవ


సహస్ర దీపాలంకరణ సేవ చేస్తున్న అర్చకులు

బనగానపల్లె రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని నందవరం చౌడేశ్వరిదేవికి శనివారం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు తదితర పూజలు చేశారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి సుందరంగా ముస్తాబు చేశారు. సహస్ర దీపాలంకరణ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బేతంచెర్ల: స్థానిక గౌరిపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పుణ్యాహవచనం, కలశ స్థాపన, నవగ్రహ పూజలు, మూల విరాట్టుకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సుజాత శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదుతండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అలేబాదు బాలయ్య భార్య బాల ఈశ్వరమ్మను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు గజేంద్రనాథ్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సారాతో అనారోగ్య సమస్యలు

డోన్ రూరల్: నాటుసారా, మద్యంతో అనారోగ్య సమస్యలు వస్తాయని.. వాటికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామం వద్దనున్న అగ్రిసోల్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డోన్ ప్రభుత్వాస్పత్రి వైద్యులు సుకుమార్, వెంకటప్రసాద్ మద్యం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మద్యానికి బానిసైతే అనారోగ్యంతో పాటు ఆర్థిక సమస్యలతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటే ఆరోగ్యకర జీవితం సాధ్యమవుతుందని తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ దౌలత్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

రమణీయం.. రథోత్సవం


రథంపై కొలువుదీరిన సీతారాములు

బేతంచెర్ల: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని సిమెంట్ నగర్‌లోని పర్వతవర్ధిని రామనాథేశ్వర ఆలయంలో శనివారం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్తుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, రామనామస్మరణ నడుమ రథోత్సవం సాగింది.

పేదింటి ఆణిముత్యాలు

- ఇంటర్ ఫలితాల్లో సత్తా

కోవెలకుంట్ల: ఇంటర్ ఫలితాల్లో పేదింటి విద్యా కుసుమాలు మెరిశాయి. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి అత్యధిక మార్కులు సాధించారు. కోవెలకుంట్ల మండలం బిజనవేములకు చెందిన లక్ష్మినరసయ్య, భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. చేనేత వృతి చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు లక్ష్మినరహరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో 470 మార్కులకు 451 మార్కులు సాధించి శభాష్ అనిపించుకున్నాడు. ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ఇంజినీర్‌గా రాణించాలన్నదే లక్ష్యమని లక్ష్మినరహరి తెలిపారు.

- అవుకు మండలం రామాపురానికి చెందిన బాల మద్దిలేటి, మధులత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. బాలమద్దిలేటి మొదట్లో గ్రామసేవకుడిగా పనిచేస్తూ 16 ఏళ్ల క్రితం వీఆర్ఓగా పదోన్నతి పొంది ప్రస్తుతం కోవెలకుంట్ల మండలం కలుగొట్ల వీఆర్ఓగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ముగ్గురి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నాడు. పెద్దకుమార్తె మధుకావేరి కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర ఎంపీసీ పూర్తి చేసింది. 952 మార్కులు సాధించి సత్తా చాటింది. బీటెక్ పూర్తి చేసి సివిల్స్ రాయాలన్నదే లక్ష్యమని తెలిపింది.


కుటుంబ సభ్యులతో లక్ష్మి నరహరి

- కోవెలకుంట్ల పట్టణానికి చెందిన జమీల్ అహమ్మద్, మున్నీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చెప్పులషాపు నిర్వహించుకుంటూ పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండో కుమార్తె సభామహెక్ పట్టణంలోని సీవీ రామన్ జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో 470 మార్కులకు 464 మార్కులతో ప్రతిభ చాటింది. ఉన్నత చదువు పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించి కుటుంబానికి చేదోడు, వాదోడుగా నిలుస్తానని తెలిపింది.


మధుకావేరి సభామహెక్

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని సీవీరామన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ రూపసాయి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో సభామహెక్ 464 మార్కులు, షఫియా 462 మార్కులు, మహమ్మద్ యాసిన్454 మార్కులు, అవినాష్ 452 మార్కులు, సీనియర్ ఎంపీసీలో జయసాయిశృతి 953 మార్కులు, సరేశ్వరరెడ్డి 951 మార్కులు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బనగానపల్లెలో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ


మాధవ (ఎంపీపీ-957), జమిమా (ఎంఈసీ-952), రాఘవి (ఎంపీసీ-453),మాబున్నీ (ఎంపీసీ-952)


అఫ్రిన్ (సీఈసీ-447), షాహిన పర్వీన్ (హెచ్ఈసీ-480), వైష్ణవి ఎంపీసీ-461, శ్రీవిద్య (బైపీసీ-422)

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 162 మందికి గాను 73 మంది, ద్వితీయ సంవత్సరంలో 100 మందికి గాను 64 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో వైష్ణవి 461 అత్యధిక మార్కులు సాధించింది. బైపీసీలో శ్రీవిద్య 422, సీఈసీలో ఎస్.అఫ్రిన్ 447, హెచ్ఈసీలో ఎస్.షాహిన పర్వీన్ 480 మార్కులతో సత్తా చాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో డి.మాబున్నీ 952, బైపీసీలో కె.ఉమామేరి 932 అత్యధిక మార్కులు సాధించారు. ఇటు ఏపీ మోడల్ స్కూల్‌లో జూనియర్ ఎంపీసీలో మొత్తం 22 మంది విద్యార్థులకు గాను 16 మంది, బైపీసీలో 29 గాను 22 మంది, సీఈసీలో 10 మందికి గాను ఏడుగురు ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో నలుగురికి 4, బైపీసీలో 9 మందికి గాను 8 మంది పాస్ అయినట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి తెలిపారు. ఎంపీసీలో కె.రాఘవి 453, బైపీసీలో జగన్నాథ్ 409 మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీలో సి.మాధవ 957, ఎంఈసీలో జమిమా 952 అత్యధిక మార్కులు సాధించారు. స్థానిక కేజీబీవీ ఉర్దూ రెసిడెన్సియల్ పాఠశాలలో ఫస్ట్ ఇయర్‌లో 37 మంది గాను 29, సెకండ్ ఇయర్ 18 మందికి గాను 12 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రభుత్వ విద్యార్థుల సత్తా

డోన్ టౌన్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో సెకండ్ ఇయర్ బీపీపీలో శ్రవంతి 974 మార్కులు సాధించింది. అలాగే ఎంపీసీలో ప్రభావతి 943, సీఈసీలో కవిత 899 మార్కులు సాధించారు. మొత్తం 83 మంది విద్యార్థులకు గాను 57 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సీనియర్ ఇంటర్‌లో 66 మందికి గాను 65 మంది, ఫస్ట్ ఇయర్‌లో 71 మందికి గాను 66 మంది పాస్ అయ్యారు. సెకెండ్ ఇయర్ ఎంపీసీలో మాణిక్యమణి 933, బైపీసీలో మనోజ 966, ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో శ్రీలత, విజయలక్ష్మీ 436, బైపీసీలో విజయమాదురి 434 మార్కులతో సత్తా చాటారు. శ్రీసుధ జూనియర్ కళాశాలకు చెందిన ఈక్షిత రాయల్, లక్ష్మీ అమృత రాయల్(ఎంపీసీ), శైలజ(బైపీసీ)- 987 మార్కులు సాధించారు. కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల కళాశాలలో ఫస్ట్ ఇయర్ 70 శాతం, సెకెండ్ ఇయర్‌లో 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకెండ్ ఇయర్‌లో 49.2శాతం, ఫస్ట్ ఇయర్‌లో 40.65 ఉత్తీర్ణ సాధించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణయ్య తెలిపారు. జ్యోతిరావు పూలే బీసీ బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరం 94శాతం, ప్రథమ సంవత్సరం 92శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో ఫస్ట్ ఇయర్‌లో భూషరాభి 455, బైపీసీలో శైలజ 434 మార్కులు సాధించారు.


శ్రవంతి (బైపీసీ-974), మనోజ (బైపీసీ-966)

ప్యాపిలి ప్రభుత్వ కళాశాలలో 78 శాతం ఉత్తీర్ణత


రవి కిరణ్, ఎంపీసీ (910), మస్తాన్‌బీ, ఎంపీపీ (894), సుస్మిత, బైపీసీ (897), రమ్య, ఎంపీసీ(460), రమణమ్మ (938), వైష్ణవి (918)

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 78.57 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 70 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయగా వారిలో 55 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో రవి కిరణ్ 910 మార్కులు, మస్తాన్‌బీ 894, బైపీసీలో సుస్మిత 898, మధు 872, సీఈసీలో మానస 839, భారతి 848,మనీషారాణి 841 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 104 మందికి గాను 32 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో గొడుగు రమ్య 460, సానియా 417, బైపీసీలో పూజిత 399 మార్కులు, సీఈసీలో మహమ్మద్ గౌస్ 377, లహరి 366, హెచ్ఈసీలో శ్రీనివాసులు 394 మార్కులు సాధించారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటుకున్నారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో 33 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా 28 మంది ఉత్తీర్ణులయ్యారు. చంద్రపల్లి రమణమ్మ 938 మార్కులతో టాపర్‌గా నిలిచింది. జంగా వైష్ణవి 918, ఎం.శిరీషా 912 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 36 మంది విద్యార్థినులకు గాను 21 మంది ఉత్తీర్ణత సాధించారు. సుంకర అంజలి 365, తలారి ధనూష 361, ఆర్. సౌమ్య 354 మార్కులు సాధించారు.

కోవెలకుంట్ల విద్యార్థుల జోరు


మనీష(947) మురళీ(457)

కోవెలకుంట్ల: ఇంటర్మీడియేట్ ఫలితాల్లో కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. రెండు కళాశాలల్లో ద్వితీయ సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించినా ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 128 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 112 మంది పాసై 87.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఎంపీసీలో మధుకావేరి 952, మనీష 947 మార్కులు, బైపీసీలో అఫ్రిన్‌బేగం 955, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో సంకీర్తన 970, ఏఅండ్‌టీలో నాగఅజయ్‌కి 937 మార్కులు వచ్చాయన్నారు. జూనియర్ ఇంటర్‌లో 244 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 126 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో లక్ష్మి నరహరి 451, బైపీసీలో అక్షయ 390, ఎంపీహెచ్‌డబ్ల్యూలో నందిని 488, ఏఅండ్‌టీలో మురళీ 457 మార్కుల సాధించినట్లు వెల్లడించారు. అలాగే అంబేడ్కర్ గురుకుల కళాశాలలో దీనాకుమారి 959(ఎంపీసీ), బైపీసీలో హర్షిత 970 మార్కులు సాధించినట్లు వివరించారు.


అఫ్రిన్‌బేగం(955), సంకీర్తన(970)


దీనాకుమారి(959), హర్షిత(970)


లక్ష్మి నరహరి(451), నందిని(488)

మెరిసిన కుసుమాలు


పుష్ప చరిత, డి.వైష్ణవి



కె.భార్గవి

అవుకు: మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆదర్శ పాఠశాలలో ఇంటర్ సెకెండ్ ఇయర్ ఎంపీసీ విద్యార్థిని పుష్ప చరిత 970 మార్కులు, బైపీసీ విద్యార్థిని డి.వైష్ణవి 960, ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విద్యార్థిని కె.భార్గవి 453, సీఈసీలో ఎస్.లలిత 450 మార్కులు సాధించారు. ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 83 శాతం, సెకెండ్ ఇయర్‌లో 81 శాతం ఉత్తీర్ణత, అలాగే కేజీబీవీలో మొదటి సంవత్సరం 60 శాతం, రెండో సంవత్సరం 65శాతం ఉత్తీర్ణత, అవుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 53 శాతం , ద్వితీయ సంవత్సరం 84శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ హెమీమా, భవాని, బాబు తెలిపారు.

మెరిసిన గ్రామీణ విద్యార్థులు

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురం గ్రామానికి చెందిన చిన్న హుసేన్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి సంతానం. వ్యవసాయం చేసుకుంటూ ముగ్గురు పిల్లలను చదివిస్తున్నారు. వీరి కుమార్తె శ్రావణి ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతూ ద్వితీయ సంవత్సర ఎంపీసీ ఫలితాల్లో 1000 మార్కులకు 961 సాధించి సత్తా చాటింది. ఇంజినీరింగ్ పూర్తి చేసి మంచి ఉద్యోగంలో స్థిరపడి కుటుంబానికి అండగా నిలవాలన్నదే తన లక్ష్యం అని శ్రావణి పేర్కొంది. అలాగే పట్టణానికి చెందిన గౌరిపేటకు చెందిన నవ్య(ఎంపీసీ), అసర్‌పేట కాలనీకి చెందిన షేక్ అయేషా సిద్ధిఖా 965(బైపీసీ) అత్యుత్తమ మార్కులు సాధించారు. ఒకరు ఎలక్ట్రిషియన్, మరొకరు వెల్డర్ కుమార్తె.


శ్రావణి, ఎంపీసీ-961, నవ్య-965


అయేషా సిద్ధిఖా, బైపీసీ-965

కొలిమిగుండ్ల విద్యార్థుల విజయకేతనం


మనస్విని, మౌనిక

కొలిమిగుండ్ల: ఇంటర్ పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ సెకండియర్ ఎంపీసీలో మనస్విని 963 మార్కులతో ప్రతిభ చాటింది. సుస్మిత 929, సీఈసీలో హుసేన్ వలి 934 మార్కులు తెచ్చుకున్నారు. ఫస్టియర్ ఎంపీసీలో గీతాంజలి 444, అశోక్‌కు 428 మార్కులు వచ్చాయి. సెకండియర్‌లో 60 శాతం, ఫస్టియర్‌లో 49.3 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సెకండియర్ ఎంపీసీ విద్యార్థి నారాయణ ఆచారికి 960, బైపీసీలో మౌనిక 960 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో షెక్షావలి 428, సీఈసీలో రబియాకు 440 మార్కులు సాధించారని పేర్కొన్నారు.


నారాయణ ఆచారి

మద్యానికి బానిసైతే జీవితం నాశనం

కోవెలకుంట్ల: మద్యానికి బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ శాఖ కోవెలకుంట్ల ఇన్‌చార్జ్ సీఐ సందీప్ యాదవ్ అన్నారు. శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని సుబ్రమణేశ్వర పాలిమర్స్, పోచా కోల్డ్‌స్టోరేజ్, సివిల్ సప్లై గోదాముల్లో పనిచేసే హమాలీలు, కూలీలకు మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అతిగా మద్యం సేవించడం వల్ల ఆర్థికంగా, ఆరోగ్యంగా చితికిపోయి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. మద్యం తాగి అనారోగ్యం పాలైతే పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని వ్యక్తులు వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్లే స్థోమత ఉండదన్నారు. మద్యానికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశాఖ ఎస్ఐ ప్రవీణ్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్స్ లక్ష్మిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.


మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తున్న ఎక్సైజ్ సీఐ సందీప్

దేవుడి ఉత్సవాల్లోనూ రాజకీయం

అవుకు: మండల పరిధిలోని ఎర్రమల కొండల్లో వెలసిన లక్ష్మీ కంబగిరి స్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున స్వామివారి కల్యాణం ఘనంగా జరుగుతుంది. కల్యాణంలో ఆలయ ధర్మకర్త స్వామివారికి పట్టువస్త్రాలు అందించి కల్యాణం నిర్వహిస్తుండేవారు. అయితే అధికారుల సహకారంతో కూటమి నాయకులు ఉత్సవాల్లోనూ రాజకీయం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి స్వామి కల్యాణానికి ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి, ఉప్పలపాడు, అవుకు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. అయితే అక్కడ ఉన్న పోలీసులు, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ రామక్రిష్ణ వారిని అడ్డుకున్నారు. ఎవరు ఆహ్వానించారని ప్రశ్నించారు. ఉత్సవాలను దేవదాయశాఖ చూసుకుంటుందని.. తిరిగి వెళ్లిపోవాలని అన్నారు. ఇక్కడ ఎలాంటి గొడవలు జరిగినా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. దీంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు. ఆ వెంటనే అధికార అండతో టీడీపీ నాయకులు బాణసంచా పేలుస్తూ, డప్పులు వాయించుకుంటూ స్వామివారి కల్యాణ కార్యక్రమానికి వచ్చారు. ఆలయ ధర్మకర్తను కల్యాణానికి రానివ్వకుండా అధికార పార్టీ నాయకులకు ఎర్ర తివాచీ పరచడం ఏంటని భక్తులు చర్చించుకున్నారు. దేవుణి ఉత్సవాల్లోనూ రాజకీయమేనా అని అసహనం వ్యక్తం చేశారు.

శ్రీసుధ విజయదుంధుభి


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కళాశాల యజమాన్యం

డోన్ టౌన్: పట్టణానికి చెందిన శ్రీసుధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయదుందిభి మోగించినట్లు ప్రిన్సిపాల్ యోగానందరెడ్డి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 38 మంది విద్యార్థులు 970 మార్కులకుపైగా సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 450 మార్కులకుపైగా సాధించిన వారిలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో ఈక్షిత రాయల్, లక్ష్మీ అమృత రాయల్ 987 బైపీసీలో శైలజ 987 మార్కులతో సత్తా చాటారు.

ఉత్తమ మార్కులు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. కేజీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో జమీల 460 మార్కులు, బైపీసీలో సుభానా 401, సీఈసీలో ఎస్.సమీరా 430, సెకండ్ ఇయర్ ఎంపీసీలో నిహారిక 969, బైపీసీలో ఆయేషా 958, సీఈసీలో లతీఫా తబసూమ్ 938 మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి తెలిపారు. అలాగే శ్రీసాయిసిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో చందనశ్రీ 444, బైపీసీలోసమీరా 426, సీఈసీలో షగుఫ్తా 468 అత్యధిక మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో భాస్కరాచారి 983, బైపీసీలో సుహాన ఫాతిమ 971 మార్కులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు గుద్దేటి చంద్రశేఖర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో 1984-87 విద్యా సంవత్సరాల్లో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులంతా ఈ కార్యక్రమం ద్వారా ఒక వేదికపై కలువబోతున్నారన్నారు. పూర్వ విద్యార్థులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: స్థానిక పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో హైవే ఫీడర్ 11 కేవీ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా వెంకటాపురం రోడ్డు, శ్రీనివాసనగర్, తారకరామనగర్, ఆర్టీసీ కాలనీ, వైఎస్సార్ నగర్, టీచర్స్ కాలనీ, నెహ్రూ నగర్, నల్లగుట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదే విధంగా యు.కొత్తపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ హాస్పిటల్, డిగ్రీ కాలేజ్, దొరపల్లె ఫ్యాక్టరీలు, జూనియర్ కళాశాల, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం


మధు సుదర్శన్, బైపీసీ-954, రామశరన్, ఎంపీసీ-462, దావూద్ ఎంపీసీ-462, తారక రాముడు, ఎంపీసీ-461 బుజ్జిబాబు, బైపీసీ-431


రుద్రప్ప- బైపీసీ-430, రాజేష్- బైపీసీ-427

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో శ్రావణి 961, బైపీసీలో మధుసుదర్శన్ 954, బైపీసీలో సి.వైష్ణవి 938 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీలో నీలావతి 422, కళ్యాణి 421, మమత 410, సీఈసీలో సంగీత 390 మార్కులు సాధించారు. కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ద్వితీయ సంవత్సరం సీఈసీలో లీలావతి 925, ప్రథమ సంవత్సరంలో రాణి 468, కీర్తన యాదవ్ 463, త్రిష 435 మార్కులు సాధించారు. ఎంజేపీ బీసీ రెసిడెన్సియల్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 100 శాతం, ప్రథమ సంవత్సరం 96.96 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.రామశరన్ 462, ఎస్.దావూద్ 462, ఎం.తారక రాముడు 461, బైపీసీలో బుజ్జి బాబు 431, రుద్రప్ప 430 మార్కులు సాధించారు.

కమలాపురం దర్గాలో కాటసాని ఫతెహాల సమర్పణ

బనగానపల్లె: వైఎస్సార్ జిల్లా కమలాపురం దర్గాలో ఉరుసు సందర్భంగా దర్గా కమిటీ కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం దర్గాను సందర్శించారు. ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అవుకు కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పోచా శీలారెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర

డోన్ టౌన్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ శోభా యాత్రను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కొత్త బస్టాండ్, సేట్ బ్యాంక్, పాత బస్టాండ్, పాతపేట, కొత్తపేట, ఇందిరానగర్, తారకరామనగర్ మీదుగా ఆంజనేయస్వామి విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.

జిందాల్ ట్రేడ్‌మార్క్‌తో విక్రయాలు

కోవెలకుంట్ల: జిందాల్ కంపెనీ ట్రేడ్ మార్క్‌తో నకిలీ రేకుల విక్రయాలపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నంద్యాలకు చెందిన మహబూబ్ ట్రేడర్స్ యజమాని తాడిపత్రి బాషా జిందాల్ కంపెనీకి చెందిన రూఫ్‌షీట్లను నకిలీ ట్రేడ్‌మార్క్‌తో ముద్రించి విక్రయాలు జరిపేవాడు. ఆ రేకులను కోవెలకుంట్లకు చెందిన వెంకటేష్ అనే వ్యాపారికి సరఫరా చేయడంతో విషయం తెలుసుకున్న ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ అంజన్‌కుమార్ గుప్త కోవెలకుంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరిపి తాడిపత్రి బాషా, వెంకటేష్‌పై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి ఎనిమిది నకిలీ రేకులు స్వాధీనం చేసుకున్నారు.